క్లుప్తంగా

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సుపథ ప్రతిభా పోటీలు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

పద్మనాభం: పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సుపథ ప్రతిభా పరీక్షలకు వంద మంది హాజరయ్యారు. రామాయణం, గేయం, పద్య పఠనం, శ్లోక పఠనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పద్మనాభం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గోస్తనీ విద్యాపీఠ్, మద్ది, విజయానందపురం హైస్కూళ్లు, పద్మనాభం కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు పంపిణీ చేశారు. గురుదేవులు యూవీఏఎన్ రాజు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గోస్తనీ విద్యా పీఠ్ వ్యవస్థాపకులు కె.సూరిబాబు, సుపథ సంస్థ ప్రతినిధులు ఎ.శ్రీహరి శర్మ, ఏవీఆర్ఎస్ శర్మ, టి.ఎర్రయ్య, ఎస్.సురేష్, ఎ.దేముడు. టి.లక్ష్మి నాయుడు, ఎస్.సురేష్ పాల్గొన్నారు.

80 మందికి రక్త పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యురాలు

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రక్త పరీక్షలు నిర్వహించారు. అపోలో ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో వెల్లంకి కల్యాణ మండపం వద్ద నిర్వహించిన శిబిరంలో 80 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు. పరీక్షలు చేసిన అనంతరం వారికి వివరాలు తెలియజేసి, వైద్య సలహాలు కూడా అందిస్తామని యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు పడాల అప్పలనాయుడు, కాకర వెంకటరమణ, చెన్నా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నేవీ సంగీత విభావరి

కొమ్మాది: ఈస్టర్న్ నేవల్ కమాండ్ భీమిలి స్టేషన్‌కు చెందిన బ్యాండు బృందం ఆదివారం తమ సంగీత ప్రదర్శనతో ఉద్యోగులు, విద్యార్థులను అలరించారు. స్టేషన్ కమాండర్ సీఎస్ నాయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ సంగీత రాగాలు రెండు వేర్వేరు సెషన్లలో నిర్వహించారు. త్రివిధ దళాల మార్చింగ్‌లో వినిపించే సంగీతంతో అలరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

తగరపువలస: చిట్టివలసలో మూతపడిన పెట్రోల్ బంకులో పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. చిట్టివలసకు చెందిన నీలాపు రామిరెడ్డి అనే వ్యక్తి శనివారం బంకులో తన వాహనాన్ని పార్కింగ్ చేసి ఆదివారం వచ్చి చూస్తే కనిపించలేదు. దీంతో భీమిలి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ప్రకృతి సాగులో మార్గదర్శకుడు

- ఆదర్శంగా సర్పంచ్ సూరినాయుడు
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి



సాగులో వినియోగానికి డ్రమ్ములతో సిద్ధం చేసిన ద్రవ జీవామృతం



ఘన జీవామృతం తయారీలో శిక్షణ ఇస్తున్న సర్పంచ్ సూరినాయుడు

తగరపువలస : భీమిలి మండలం మజ్జిపేట సర్పంచ్ మజ్జి సూరినాయుడు ప్రకృతి వ్యవసాయంలో ఇతర రైతులు, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకుడిగా నిలిచాడు. నాలుగేళ్ల క్రితం వరకు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులతో సాగు చేసిన ఈయన ప్రకృతిసాగు వలన నేలతల్లికి, ఆహారం తినే ప్రజలకు ఆరోగ్యం సిద్ధిస్తుందని అవగాహన పెంచుకున్నాడు. అంతేకాకుండా పెట్టుబడి ఖర్చులు తగ్గడం, దిగుబడి పెరగడంతో మిగిలిన రైతులు కూడా ప్రకృతిసాగులోకి మారాలని సూచనలు చేస్తున్నాడు. ప్రస్తుతం సూరినాయుడు తనకున్న నాలుగు ఎకరాలలో బొప్పాయి ఇందులో అంతర పంటగా కర్బూజా, వంగ, టమాటా, వేరుశనగ, తులసి పంటలు ప్రకృతిసాగు ద్వారా పండిస్తూ మిగిలిన రైతుల కంటే 10 శాతం అధిక దిగుబడితో విజయం సాధించాడు. రసాయన, క్రిమిసంహారక మందుల వినియోగం మిగిలిన రైతుల ఖర్చుతో పోలిస్తే పదోవంతు మాత్రమే పెడుతున్నాడు. దీనికి ఈయనకు ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ పొందిన అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

200 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ములలో 10 కిలోల దేశవాళీ పశువులు పేడ, 10 లీటర్ల గోమూత్రం, 2 కిలోల బెల్లం, 2 కిలోల శనగపిండి, పావు కిలో పుట్టమన్ను వేసి నిండా నీటితో నింపుతున్నారు. 3 నుంచి 5 రోజుల పాటు నీడలో ఉంచి ఉదయం, సాయంత్రం కర్రతో కలియతిప్పి చివరగా వడకట్టుకోవాలి. 15 లీటర్ల నీటికి ఒక లీటర్ జీవామృతాన్ని చేర్చి పంట కాలంలో 4 నుంచి 5 సార్లు వినియోగించుకోవాలి. ఈ జీవామృతం ఎకరాకు 200 లీటర్లు సరిపోతుంది. ఎకరాకు రసాయన ఎరువులు, డీఏపీ ఖర్చు రూ.6వేలు అవుతుండగా ఈ 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారీకి కేవలం రూ.250 అవుతుంది. నాలుగుసార్లు వినియోగానికి రూ.వెయ్యితో ఖర్చు మాత్రమే అవుతుంది. రూ.5వేలు ఆదా చేసుకోవచ్చు.

టైప్–2 ఘన జీవామృతం తయారీ

సాధారణంగా రైతులు వినియోగించే పశువుల గెత్తం (పెంట) లోపలి భాగం వేడిగా, పైన సూర్యరశ్మి కారణంగా అందులో పోషకాలు అందించే సూక్ష్మజీవులు జీవం కోల్పోతాయి. వీటికి జీవం అందించేందుకు గాను 100 కిలోల పశువుల గెత్తానికి 20 లీటర్ల ద్రవజీవామృతాన్ని చేర్చి అయిదు రోజుల పాటు పరదాలతో కప్పివేయాలి. దీనివలన కిణ్వన ప్రక్రియ జరిగి సూక్ష్మ పోషకాలు ఉత్తేజమవుతాయి. డీఏపీకి ప్రత్యామ్నాయంగా ఎకరాలకు వెయ్యి కిలోలు వినియోగించవలసి ఉంటుంది. దీనిని మొక్క దగ్గర, ఆఖరి దుక్కులో జల్లుకోవాలి. ఖర్చులతో కలిపి ట్రాక్టర్ పశువుల గెత్తం రూ.వెయ్యికి లభిస్తుంది.

మీనామృతం : అందుబాటులో ఉన్న చేపల వ్యర్థాలను సేకరించి అందుకు సరిసమానమైన బరువు కలిగిన బెల్లాన్ని పొరలు పొరలుగా వేసుకుని బక్కెట్లు, టబ్బులలో 42 రోజుల పాటు నిల్వ చేసుకోవాలి. తరువాత సగం ద్రవరూపంలో బంగారు వర్ణంతో మీనామృతం సిద్ధమవుతుంది. దీనిని ఆరుమాసాల పాటు నిల్వ చేసుకోవచ్చు. 200 లీటర్ల నీటిలో రెండున్నర లీటర్ల మీనామృతం పిచికారి చేసుకోవచ్చు. దీనికి బెల్లం ఖర్చు మాత్రమే ఎకరాకు రూ.250 అవుతుంది. దీంతో ఎకరాకు అవసరమైన 8 ట్యాంకులు తయారవుతుంది.



ద్రవ జీవామృతం తయారీపై తోటి రైతులకు వివరిస్తున్న సర్పంచ్ సూరినాయుడు

జీవామృతాలతో భూమికి పునరుజ్జీవం..



రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడకం వలన భూమిలో విలువైన పోషకాలు నిర్జీవమైపోతున్నాయి. వీటి వాడకం వలన ఆక్సిజన్ తగ్గి, కర్బన పదార్థాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ జీవామృతాలు వినియోగించడం వలన వానపాములు, ఆరుద్ర పురుగులు, ఫంగస్, బ్యాక్టీరియా తదితర సూక్ష్మపోషకాలు జీవం పుంచుకుంటాయి. భూమిని మెత్తగా, గుల్లగా, తడిగా ఉంచుతాయి. దీని వలన నీటి తడులు రసాయన ఎరువులు వాడేటప్పుడు 15 రోజుల గ్యాప్ ఉంటే ప్రకృతి ఎరువులు వాడకంతో 25 రోజులు గ్యాప్ ఉండవచ్చు. ఖర్చులు ఆదా అయి దిగుబడి కూడా పెరుగుతుంది.

–మజ్జి సూరినాయుడు, సర్పంచ్, మజ్జిపేట

వృద్ధి కారకాలుగా జీవామృతాలు



ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్న విధంగా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. దుక్కి, మొక్క, సిరి పొట్ట, గింజ పాలుపోసుకునే దశలలో జీవామృతాలు వినియోగించవచ్చు. భూమిలో తేమశాతం పెరిగి భూగర్భ జలాలు పెరుగుతాయి. నీటి వాడకం తగ్గుతుంది. గాలిలో కార్బన్ డయాక్సైడ్ తగ్గి తద్వారా గ్లోబల్ వార్మింగ్ సమస్య తగ్గుతుంది. జీవామృతాలు భూమిలో సూక్ష్మపోషకాలు వృద్ధికి కారణమవుతాయి.

–బి.వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ఇంచార్జ్

భౌగోళిక అంశాలపై పట్టు అవసరం



సోషల్ స్టడీస్ మ్యాప్‌లో ప్రాంతాల గుర్తింపుపై వివరిస్తున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: భౌగోళిక అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చిట్టివలస హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం ఆమె తరగతి గదిని సందర్శించారు. ఈ సందర్భంగా సోషల్ స్టడీస్ బోధన జరుగుతుండగా మ్యాప్‌లో భౌగోళిక అంశాలను గుర్తించడం కాకుండా నేరుగా మ్యాప్ గీయడంలో నైపుణ్యత సాధించాలన్నారు. త్వరలో జరగనున్న పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. అలాగే ఇటీవల ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో పంపిణీ చేసిన ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మరళీమోహన రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో విష్ణు సహస్ర పారాయణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం చెన్నైకు చెందిన విశ్వాస్ విష్ణు సహస్ర నామ సంస్థాన్ ఆధ్వర్యంలో శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. భీష్మాష్టమి సందర్భంగా ఈ పూజాలు, పారాయణ నిర్వహించినట్లు విశ్వాస్ సభ్యులు సన్యాసినాయుడు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో యు.రమేష్, ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

చిట్టివలస హైస్కూల్ విద్యార్థులతో డీఈవో చంద్రకళ



విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందిస్తున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) శిక్షణను పూర్తి చేసుకున్న విద్యార్థులు దానిని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ సూచించారు. చిట్టివలస హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తి చేసుకున్న 9 నెలల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత ఏడాది సొసైటీ నుంచి శిక్షణ పొందిన విద్యార్థుల్లో 9 మంది స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ ఏడాది 120 మంది విద్యార్థులు లాంగ్‌టెర్మ్‌లో శిక్షణ పొందినందున 70 మందికి పైగా విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు నాలుగేళ్లపాటు రూ.12వేలు వంతున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. విద్యార్థులకు అంకితభావంతో శిక్షణ అందిస్తున్న సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులను ఆమె అభినందించి సన్మానించారు. అనంతరం ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందించారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేక అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయులు బంటు అప్పారావు, పక్కి నాగేశ్వరరావు, వైవీ రమణ, ఎలమంచిలి జూనియర్ కళాశాల సూపరింటిండెంట్ జి.అప్పారావు, దయాసాగర్, డాక్టర్ ఆనంద్, వీటీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాంజా దారం చుట్టుకుని బాలుడికి గాయాలు



గాయమైన సాయిరోహిత్ కాలు

తగరపువలస: గాలిపటాలు ఎగురవేయడానికి మాంజా దారాన్ని ప్రభుత్వం నిషేధించినా ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుగుతున్నాయి. ఇటీవల చిట్టివలసలో మంజా దారం కాలికి తగులుకుని ఏడేళ్ల పక్కి సాయిరోహిత్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం తమ కుమారుడు కోలుకున్నట్టు బాధిత బాలుని తల్లిదండ్రులు ఆదివారం తెలిపారు. ఆట స్థలంలో సైకిల్ తొక్కుతుండగా తెగిపడి ఉన్న దారం తగులుకుని కాలిచుట్టూ గాయం కావడంతో ఆస్పత్రిలో వైద్యులు కుట్లు వేశారు. మాంజా దారం కారణంగా పశువులు, పక్షులు మృత్యువాత పడుతున్నందున వీటి విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న శ్రీ అభయాంజనేయ స్వామి

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు బమ్మిడి సూర్యనారాయణ, ఉమ దంపతుల ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, గణపతి పూజ పుణ్యాహవచనం, గణపతి, షిర్డీ సాయి సహిత అభయాంజనేయ స్వామికి పంచామృత అభిషేకాలు, నవగ్రహ సహిత మండపారాధన, తమలపాకులు, అరటి పళ్లు, సింధూర సహిత సహస్రనామార్చన నిర్వహించారు. కుసులువాడ గొల్లలపాలెం బృందంచే హరేరామ, హరేకృష్ణ నామ సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, కోరాడ జ్ఞానేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ జిల్లా కార్యదర్శి అప్పలరాజుకు సత్కారం



అప్పలరాజు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

తగరపువలస: అఖిల భారత పద్మశాలీ సేవా సంఘం జిల్లా కార్యదర్శిగా ఇటీవల నియమితులైన తెడ్లాపు అప్పలరాజు దంపతులను వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. సత్యనారాయణమెట్టపై జరిగిన ఈ సత్కారసభలో పలువురు పాల్గొని పూలమాలలు, శాలువాలతో గౌరవించారు. ముందుగా ముస్లిం వీధిలో గఫూర్ సమక్షంలో జరిగిన సత్కార కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గిడుతూరి కల్యాణి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, వైఎస్సార్‌సీపీ వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, రాష్ట్ర శిష్టకరణాల సంఘం మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, సరగడ నాగిరెడ్డి, జీరు పద్మ, మద్ది మహాలక్ష్మి, ఎల్లమాంబ టైలర్స్ సంఘం తరపున గిడుతూరి శ్రీనివాసరావు, చింతల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు

భీమునిపట్నం: భీమిలి గ్రామ దేవత నూకాలమ్మ ఉత్సవాల కరపత్రాలను ఆలయం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలు మార్చి 20 నుంచి 23 వరకు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా ఊరేగించడంతోపాటు వివిధ నేలవేషాలు, ఊరేగింపులతోపాటు పెద్దబజారు, ఎగువపేట, చిన్నబజారు ప్రాంతాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే గంట స్తంభం వేదిక వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాంభక్త ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి కాసరపు పెద ఎల్లాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి నమ్మి శేషాద్రి యాదవ్, కోఆర్డినేటర్ ముమ్మిడిశెట్టి సునీల్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



నమ్మివానిపేటలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: పద్మనాభం మండలం విజయరాంపురం ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు ఆదివారం జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేట, సంగివలస గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మనిషి ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి మళ్లీ నిద్ర పోయే వరకు ఎన్నో ఆలోచనలు, సుఖదుఃఖాలు, ప్రయాసలకు లోబడి సంపాదనే ధ్యేయంగా తృప్తి లేకుండా గడుపుతున్నాడన్నారు. గీత జ్ఞానం ప్రకారం కర్మ విధానం తెలుసుకుని మోక్షం ద్వారా జనన, మరణ చక్రం నుంచి విముక్తి పొందాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.త్రినాథరావు, వి.సురేష్, ఎస్.శ్రీనివాస్, బి.అంకమ్మ, ఆదమ్మ, కె.సత్యవతి, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డికి జాతీయ సేవా పురస్కారం



వరంగల్‌లో శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న కన్నతల్లి ఫౌండేషన్ ప్రతినిధులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డుకు చెందిన వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, వుయ్ కేర్ యూ సొసైటీ ప్రతినిధి వెంపాడ శ్రీనివాసరెడ్డిని ఆదివారం సాయంత్రం వరంగల్‌కు చెందిన కన్నతల్లి ఫౌండేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సంక్రాంతి జాతీయ పురస్కారాలలో భాగంగా ఏపీ, తెలంగాణలో సేవారంగంలో కృషి చేసిన 90 మందిని సత్కరించారు. అందులో భాగంగా తనకు ఈ అదృష్టం దక్కినట్టు శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాజన్‌బాబు, కార్పొరేటర్ మరుపల్లి రవి, భక్త రామదాసు వారసుడు కంచర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన ప్రీ ప్రైమరీ పరీక్షలు


తగరపువలస: ఫిబ్రవరి 11, 12 తేదీల్లో జరగనున్న దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షల్లో భాగంగా ఆదివారం లోయర్, హయ్యర్ విద్యార్థులకు ప్రీ ప్రైమరీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలను మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పర్యవేక్షించారు. పరీక్షలకు ఫిబ్రవరి 5న హాల్ టిక్కెట్లు జారీ చేయనున్నట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. కృష్ణారావు తెలిపారు.

అడుగడుగునా పగుళ్లే

- తగరపువలస నుంచి భీమిలికి పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా
- ఐదు కిలోమీటర్ల పరిధిలో ఏదో ఓ చోట నిత్యం ఆటంకమే
- తాజాగా రెండు రోజుల నుంచి నీటి సరఫరా బంద్
- కొత్తగా పైప్‌లైన్ వేయాలని వేడుకుంటున్న స్థానికులు



దెయ్యాల మర్రి చెట్టు ప్రాంతంలో రెండు రోజులుగా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన గోతులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి పట్టణ ప్రాంతానికి సరఫరా అవుతున్న తాగునీటి పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో నీటి సరఫరాలో నిత్యం అంతరాయం కలుగుతోంది. తగరపువలసలోని గోస్తనీ నది వద్ద కొండపేట పంప్‌హౌస్ ద్వారా పైప్‌లైన్ నుంచి చిట్టివలస గణేష్ థియేటర్, భీమిలి రోడ్డు మీదుగా భీమునిపట్నంలో కృష్ణాకాలనీ, కొండపేట గ్రామాల్లో ఉన్న 450, 800 కేఎల్ రిజర్వాయర్లకు నిత్యం తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఈ మార్గంలో పైప్‌లైన్‌కు పగుళ్లు ఏర్పడడంతో తాజాగా భీమిలి పట్టణానికి శని, ఆదివారాలు తాగునీటి సరఫరా నిలిపి వేశారు. ఈ రెండు రోజుల నుంచి రాత్రీపగలు మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇంకా పనులు పూర్తి కాలేదు.

నీటి సరఫరాకు నిత్యం ఆటంకమే

తగరపువలస నుంచి భీమిలి వరకు సుమారు అయిదు కిలోమీటర్ల పరిధిలో పద్నాలుగు చోట్ల పైప్‌లైన్‌కు పగుళ్లు ఏర్పడ్డాయి. గతంలో ఈ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేటప్పుడు గ్లాస్ రీయిన్‌ఫోర్స్ పైప్‌ను వినియోగించిన కాంట్రాక్టర్... ఆ పైప్‌లైన్ చుట్టూ ఇసుకతో కప్పించలేదు. దీంతో తాగునీటి సరఫరా జరిగిన ప్రతీసారి నీటి ప్రవాహ ఒత్తిడి కారణంగా పైపులకు రాళ్ల పిక్కలు తగిలి పగిలిపోవడం నిత్యకృత్యమయింది. కొండపేట పంప్‌హౌస్‌కు పది అడుగుల దూరంలో రెండు చోట్ల, చిట్టివలస బాలికల వసతి గృహం ముందు రెండు చోట్ల, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ముందు రెండు చోట్ల, చావుల మదుం రోడ్డులో ఒకచోట, గణేష్ థియేటర్ రహదారిలో రెండుచోట్ల, భీమిలి రోడ్డులో చిల్లపేట శివారు మరడపాలెం, రాయపాలెం దెయ్యాల మర్రిచెట్టు, బ్యాంకు కాలనీ కుంచాలమ్మ ఆలయం, భీమిలి వ్యవసాయ మార్కెట్ ఎదురుగా కాలనీ, కీతిన్‌పేట సెయింట్ పీటర్ చర్చి వద్ద తరచూ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నా పనిచేయడం లేదు. ఈ మార్గంలో కొత్త పైప్‌లైన్ వేయడం తప్ప మరోమార్గం కనిపించడం లేదని సిబ్బంది సైతం వాపోతున్నారు. నెలలో 25 రోజులు ఈ మరమ్మతులతో వారంతా విసిగిపోతున్నారు. మరమ్మతులతో సమయం, డబ్బుల ఖర్చు తప్ప ఫలితం లేదని భీమిలి పట్టణ ప్రజలు కూడా వాపోతున్నారు. కొత్తగా తాగునీటి పైప్‌లైన్ వేసి తమ దాహార్తిని తీర్చాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ఆదివారం సాయంత్రం తిరిగి పగిలిన పైప్‌లైన్



బ్యాంకు కాలనీ కుంచాలమ్మ ఆలయం వద్ద బడ్డీ కింద పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది